క్లుప్తంగా

సీఎం సహాయనిధికి రూ.13.80 లక్షలు విరాళం



సీఎం సహాయ నిధికి చెక్కును అందజేస్తున్న మెప్మా అధికారులు, సిబ్బంది

కర్నూలు (టౌన్): విజయవాడ వరద బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధికి ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయ సిబ్బంది రూ.13.80 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మెప్మా అధికారు లు, మహిళా గ్రూపు సభ్యులు కలిశారు. ఉమ్మ డి జిల్లాలోని ప్రతి మహిళా గ్రూపు నుంచి రూ. 10 చొప్పున ఈ విరాళం ఇస్తున్నట్లు మెప్మా పీడీ నాగ శివలీల కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వారిని అభినందించారు. టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మీ, ఏఓ మాసుంబాషా, సీఎంఎం మురళీ, పట్టణ మహిళా సమైఖ్య అధ్యక్షులు సంతోషమ్మ పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి బెంగళూరులోని వహీద్ గ్రూప్ ఎఫ్ఎం డెవలప్‌మెంట్ సొసైటీ వారు రూ.50 వేలు విరాళం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు అందజేశారు. వహీద్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ షేక్ వహీద్ బుధవారం చెక్కును అందజేశారు.

అన్నదానభాగ్యం పూర్వజన్మ సుకృతం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): అన్నదాన భాగ్యం పూర్వజన్మ సుకృతం అని, మానవ సేవకు మించిన సేవ మరొకటి లేదని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం స్థానిక నగరపాలకలో ఏర్పాటు చేసిన గణనాథుడికి మేయర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, సీనియర్ అసిస్టెంట్లు రామకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాధాష్టమి



ప్రత్యేక అలంకరణలో రాధాగోవిందుడు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో బుధవారం భక్తిశ్రద్ధలతో రాధాష్టమి వేడుకలు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. హరినామ సంకీర్తన, రాధాగోవిందులకు పుష్పాభిషేకం జరిగింది. రాజభోగ హారతి, మహా ప్రసాద వితరణ చేశారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టాప్ నంబర్ లేకుంటే ఆటో సీజ్

కర్నూలు: నగరంలో తిరిగే ఆటోలకు టాప్ నంబర్ వేయించుకోకపోతే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ హెచ్చరించారు. ఆయన బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటోలకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ నంబర్‌తో పాటు ట్రాఫిక్ పోలీసులు కేటాయించే టాప్ నంబర్ ఉండాలన్నారు. వాహన డాక్యుమెంట్లు, డ్రైవింగ్ లైసెన్సు వెంట ఉంచుకోవాలని, యూనిఫాం ధరించి ఆటోలు నడపాలన్నారు. నంబర్ ప్లేట్లు గజిబిజీగా ఉన్నా, డ్రైవర్‌కు ఇరువైపులా ప్యాసింజర్ సీట్లు ఉన్నా, అడ్డదిడ్డంగా పోస్టర్లు అతికించినా చర్యలు తీసుకుంటామన్నారు. మూడు రోజుల్లో అన్నీ సరిచేసుకోవాలని, లేనియెడల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో బుధవారం అంతర్ పాఠశాలల హ్యాండ్‌బాల్ పోటీలను గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ ప్రారంభించారు. క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అవిఘ్న'నాయకుడు' @ 44

- కర్నూలులో రెండు విగ్రహాలతో ప్రారంభమైన వినాయకచవితి ఉత్సవాలు
- ప్రస్తుతం సుమారు 2400 విగ్రహాలతో వేడుకల నిర్వహణ
- మట్టి వినాయక విగ్రహాలకు పెరిగిన ప్రాధాన్యం
- రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలుస్తున్న వినాయక విగ్రహాల శోభాయాత్ర
- మత సామరస్యానికి ప్రతీకగా నిమజ్జన వేడుక

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ గణనాథుని ఉత్సవాలకు 44 ఏళ్ల చరిత్ర ఉంది. 1980లో రెండు విగ్రహాలతో వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదట మించిన్ బజార్, బుధవారపేటలో రెండు విగ్రహాల ఏర్పాటుతో వేడుకలను ప్రారంభించారు. క్రమంగా వినాయక విగ్రహాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 12 వేల విగ్రహాలను ఏర్పాటు చేయగా ఒక్క కర్నూలు నగరంలోనే సుమారు 4200 విగ్రహాలు కొలువుదీరినట్లు ఉత్సవ సమితి ప్రతినిధులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన విగ్రహాల్లో 45 శాతం మట్టి విగ్రహాలు ఉండటం విశేషం. కర్నూలు గణేశ్ ఉత్సవాలు, శోభాయాత్ర, నగరం నడిబొడ్డున కేసీ కాలువలో నిర్వహించే నిమజ్జనోత్సవం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేకతను చాటుతోంది.

ప్రకృతి హితంగా పండుగ

కర్నూలు నగరంతో పాటు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. గతంతో పోలిస్తే మట్టి విగ్రహాల సంఖ్య భారీగా పెరిగింది. 45 శాతం వరకు మట్టి విగ్రహాలు ఉన్నట్లు గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు పేర్కొంటున్నారు. నగరంలో సుమారు 32 వేల చిన్న విగ్రహాలను ఇళ్లలో పూజించినట్లు చెబుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర గణేశ్ మహోత్సవ సమితి, వివేకానంద స్టడీ సర్కిల్, శ్రీసాయినాథ్ పతంజలి యోగా కేంద్రం, భారత్ వికాస్ పరిషత్, వాసవీ ఏజెన్సీస్ తదితర స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడంతో మార్పు చోటు చేసుకుంటోంది. శ్రీ లక్ష్మి నారసింహ వినాయక భక్త బృందం వారు గత నాలుగేళ్లుగా తుంగభద్రా నది తీరంలో భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2018లో 55 అడుగులు, 2019లో 65 అడుగులు, 2022లో 60, 2023లో 56, ఈ ఏడాది 63 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. దత్తాత్రేయ రూపంలో ఉన్న ఈ భారీ గణనాథుడిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి వస్తున్నారు.



తుంగభద్రా తీరంలో కొలువుదీరిన 63 అడుగుల మట్టి వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు

వెల్లివిరుస్తున్న మత సామరస్యం

నగరంలో వినాయకచవితి ఉత్సవాల్లో మత సామ రస్యం వెల్లివిరుస్తోంది. గతంలో వరుసగా మూడేళ్లు వినాయక నిమజ్జనం, బక్రీద్ పండుగ, ఓసారి మొహర్రం, నిమజ్జనోత్సవం ఒకే రోజున జరుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నగర వాసులు సోదర భావంతో మెలుగుతూ రెండు వేడుకలను విజయవంతం చేశారు. విగ్రహాల వెంట వచ్చే భక్తులకు ముస్లింలు తాగునీరు, మజ్జి గ ప్యాకెట్లు అందజేయడంతో పాటు పలుచోట్ల అల్పాహారం సైతం అందిస్తుంటారు. ఈ ఏడాది 15వ తేదీన నిమజ్జనం 16న మిలాదున్ నబి పర్వదినం నిర్వహించుకోనున్నారు. ఈసారి కూడా ఉత్సవాలు ప్రశాంతంగా జరుగుతాయని శాంతి కమిటి ప్రతినిధులు, ఉత్సవ సమితి సభ్యులు భావిస్తున్నారు.

ప్రశాంత వాతావరణంలో వేడుకలు



కర్నూలులో నగరంలో ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నాం. జిల్లా అధికారులు, పోలీసులు, ఉత్సవ సమితి, స్థానిక ఉత్సవ కమిటీలు, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ తదితర సంస్థల సహకారంతో వినాయక శోభాయాత్ర, నిమజ్జనోత్సవం విజయవంతంగా జరుపుకుంటున్నాం. పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ మట్టి గణపతులను పూజించడం సంతోషంగా ఉంది.

– జంపాల జనార్దన్, నగర ప్రధాన కార్యదర్శి, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి

రెండు విగ్రహాలతో ప్రారంభం



రెండు విగ్రహాలతో కర్నూలులో వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రస్థానం క్రమంగా పెరుగుతూ 2400 విగ్రహాల ఏర్పాటు వరకు వచ్చింది. పర్యావరణ పరిరక్షణపై ఉత్సవ సమితి, వివిధ సంస్థలు అవగాహన కల్పించడంతో మట్టి విగ్రహాల ఏర్పాటు బాగా పెరిగింది. కర్నూలు నగరవ్యాప్తంగా 9వ రోజు నిమజ్జనం, 63 అడుగుల భారీ వినాయకుడిని 11వ రోజున ప్రతిష్ఠించిన చోటనే నిమజ్జనం జరుగుతుంది.

– డాక్టర్ నాగఫణి శాస్త్రి, జిల్లా సంఘటనా కార్యదర్శి, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి

ప్రజల అవసరాలు గుర్తించాలి



సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కల్చరల్: అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజల అవసరాలు గుర్తించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఉపాధి హామీ, హౌసింగ్ తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా కమ్యూనిటీ అవసరాల జాబితాను అంచనాలతో సహా రూపొందించాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలన్నారు. కొన్ని మండలాల్లో ఉపాధి హామీ పనులు కల్పించడంలో వెనకబడి ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనుల కల్పనలో జిల్లా 25వ స్థానంలో ఉందని చెప్పారు. చెత్త సంపద తయారీ కేంద్రాలకు సంబంధించి అక్టోబర్ 2వ తేదీ నాటికి అన్ని కేంద్రాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ డాక్టర్ బి.నవ్య, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీం బాషా, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూడాలకు వసతి ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాలిటీ విభాగంలో పనిచేసే జూనియర్ డాక్టర్లకు రాత్రి వసతి ఏర్పాట్లను మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ బుధవారం పరిశీలించారు. మహిళా డాక్టర్లకు నాలుగు బెడ్లు, పురుష డాక్టర్లకు నాలుగు బెడ్లు వేర్వేరు గదుల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళల వసతి కేంద్రం క్యాజువాలిటికి దగ్గరలో ఉండేలా చూడాలన్నారు. ఇటీవల జూనియర్ డాక్టర్ల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు లైటింగ్, వసతి, సీసీ కెమెరాలు ఏర్పాట్లకు సంబంధించి పనులు జరుగుతున్నాయని, త్వరలో వసతి గదులు కూడా ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హెచ్ఓడీ డాక్టర్ రామశివ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఉన్నారు.

ఉచిత న్యాయ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) బి.లీలా వెంకటశేషాద్రి బుధవారం మార్కెట్ యార్డులో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులకు అవసరమైన సహాయం ఉచితంగా అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ ఉందని తెలిపారు. ప్రతి ఒక్క కార్మికుడు ఈ–శ్రమ్, పీఎం ఎస్‌వైఎం కార్డును చేయించుకుంటే లబ్ధి పొందవచ్చని, మీకు, మీ కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సిస్టమ్, శాశ్వత లోక్ అదాలత్ అందించే న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సి.సాంబశివ, న్యాయవాది పి.నిర్మల, లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, మార్కెట్ యార్డు సెక్రటరీ గోవిందు పాల్గొన్నారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



వినాయక ఘాట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు (టౌన్): ఈ నెల 15న వినాయక ఘాట్ వద్ద నిర్వహించనున్న నిమజ్జనానికి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ స్పష్టం చేశారు. బుధవారం రాత్రి నగరంలోని రాంబొట్ల దేవాలయం, అలాగే వినాయక ఘాట్‌ను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిమజ్జనం రోజున విధుల్లో ఏ ఒక్కరూ అలసత్వం ప్రదర్శించరాదని, షిఫ్టుల వారీగా ఘాట్ల వద్ద నియమించిన అధికారులు, సిబ్బంది 32 గంటల పాటు పర్యవేక్షణ చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. నగరపాలక ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, డీఈఈ నరేష్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్, ఏఈలు వెంట ఉన్నారు.

రోడ్డును ఆక్రమించి బంకుల ఏర్పాటు



సి.క్యాంపు నుంచి రైతుబజార్‌కు వెళ్లే దారిలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బంకులు

కర్నూలు (టౌన్): ఓ వైపు రాష్ట్ర మంత్రి కర్నూలు నగరంలో ఆక్రమణలు తొలగించండి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ మున్సిపల్ అధికారులకు ఆదేశాలు సైతం ఇచ్చారు. అయితే మంత్రి పేరు చెప్పి సి.క్యాంపు సెంటర్‌లో తెలుగు తమ్ముళ్లు మాత్రం ఇష్టారాజ్యంగా రోడ్లను ఆక్రమిస్తున్నారు. ఎంతో బిజీగా ఉన్న ఏరియాల్లో రోడ్లను ఆక్రమించి బంకులు ఏర్పాటు చేశారు. వేలాది రూపాయలకు అద్దెకు ఇచ్చేస్తున్నారు. నిబంధనలు పాటించి ఏర్పాటు చేసుకుంటే ఎవరికి ఏలాంటి ఇబ్బంది ఉండదు. అయితే ఇష్టానుసారంగా ఏర్పాటుచేస్తేనే ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. సరిగ్గా సి.క్యాంపు సెంటర్‌లో మున్సిపల్ స్కూల్‌కు అనుకొని బంకులు వేశారు. అక్కడ విద్యార్థినుల బాత్‌రూమ్‌లు ఉన్నాయి. అలాగే ఉదయం నుంచి వాహనదారులు, మహిళలు, రైతుబజార్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్లపైనే బంకులు ఏర్పాటు చేయడంతో అటువైపు వెళ్లే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికార పార్టీ నాయకులు కాబట్టే ఎక్కడ పడితే అక్కడ బంకులను ఏర్పాటు చేసుకుంటున్నారని, మున్సిపల్ ఆదికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై స్థానికులు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి ఫిర్యాదు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

జయములివ్వు బొజ్జ గణేశా







పప్పుల బజార్‌లో సప్త ఆశ్వాల రథంపై వినాయకుడు, చిత్తారి వీధిలో.., మించిన్ బజార్‌లో వేంకటేశ్వరస్వామి రూపంలో.. రంగారెడ్డి స్ట్రీట్‌లో..







మున్సిఫ్ కోర్టు సమీపంలో.. ధర్మపేట ఎస్వీ ప్రైడ్‌లో.. గీతామందిర్ సమీపంలో.. సెంట్రల్ ప్లాజాలో.. కృష్ణానగర్‌లో..

కర్నూలు కల్చరల్: గణేష్ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఐదో రోజు బుధవారం వినాయకుడి ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, విష్ణు, లలితా సహస్ర పారాయణాలు నిర్వహించారు. భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందిరాగాంధీ నగర్, సీతారామం నగర్‌లోని వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి పాల్గొని అన్నదానం చేశారు. శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు



వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న రంగస్వామి

- కర్నూలు సి.క్యాంప్ సెంటర్‌లో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం లడ్డూ వేలంపాట నిర్వహించగా రంగస్వామి రూ.17,500లకు దక్కించుకున్నారు.

జోగులాంబ హాల్ట్ తాత్కాలికంగా రద్దు

కర్నూలు కల్చరల్: రైల్వే ప్లాట్‌ఫారం పనుల కారణంగా కొన్ని రైళ్లకు శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వే స్టేషన్ వద్ద హాల్ట్ (నిలపడం) తాత్కాలికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు హాల్ట్ ఉండదని పేర్కొన్నారు. కాచిగూడ-గుంటూరు, హంద్రీ ఎక్స్‌ప్రెస్, గుంతకల్-బోదన్, ఔరంగబాద్-గుంటూరు, తుంగభద్ర ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-గుంతకల్ రైళ్లు జోగుళాంబ స్టేషన్‌లో ఆగవని వెల్లడించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కర్నూలు(హాస్పిటల్): యూత్ ఫెస్ట్‌లో భాగంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు గాను జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎ.క్యాంపులోని ఇందిరాగాంధీ స్మారక మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో 20 మంది విద్యార్థులు 10 బృందాలుగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ అధికారి సుధారాణి పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధుల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలను వేయించడం వల్ల వారికి భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. ఆయన బుధవారం ఇల్లూరు నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయం 113లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మాట్లాడుతూ.. నవజాత శిశువు రోగాల బారిన పడకుండా ఉండాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాలు వచ్చేంత వరకు పలు విడతలుగా టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు ఇవ్వడం వల్ల క్షయ, కంఠసర్పి, అంధత్వం, కామెర్లు, అతిసారం, ధనుర్వాతం, పోలియో, న్యుమోనియా, కోరింత దగ్గు, హెపటైటిస్–బి వంటి జబ్బులు రాకుండా నియంత్రించవచ్చన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి పాల్గొన్నారు.

చేతగాని సీఎం చంద్రబాబు

కర్నూలు(న్యూసిటీ): రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన మెడికల్ కాలేజీలకు అనుమతులు సాధించలేని చేతగాని సీఎంగా చంద్రబాబునాయుడు మిగిలి పోయారని సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఐదు కళాశాలలకు అనుమతి సాధించిదని గుర్తు చేశారు. తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ రాష్ట్రంలో నిర్మించిన అన్ని మెడికల్ కాలేజీలకు అనుమతులు సాధిస్తే, ఎన్‌డీఏ కూటమిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు అనుమతులు సాధించలేకపోవడం చేతగానితనానికి నిదర్శనమని దుయ్యబట్టారు.



పేరుకుపోయిన శిథిలాలు, చెత్తాచెదారం



టాయిలెట్ దుస్థితి

పరిపాలనా కేంద్రం.. అధ్వానం

- వీధి కుక్కల స్వైరవిహారం.. ఎటు చూసిన మలమూత్రాలే
- డ్వామా, వ్యవసాయ శాఖల మధ్య కూలడానికి సిద్ధంగా ఉన్న పైకప్పు
- పేరుకుపోయిన చెత్తచెదారం.. అధ్వానంగా టాయ్‌లెట్స్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పరిపాలన కేంద్రమైన కలెక్టరేట్ పరిస్థితి దయనీయంగా తయారైంది. పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తున్నా.. పట్టించుకునే వారే లేరు. జిల్లా పరిపాలనకు ఆద్యులైన కలెక్టర్, జేసీ కొలువైన కార్యాలయం ఇంత అధ్వానంగా మారడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. కలెక్టరేట్‌లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడ చూసినా కుక్కలు విసర్జించిన మల మూత్రాలు కనిపిస్తున్నాయి. జేసీ చాంబరుకు కొన్ని అడుగుల దూరంలోనే ఈ పరిస్థితి నెలకొంది. ప్రతి రోజు వందలాది మంది ఉద్యోగులు వీటిని దాటుకుంటూ తిరుగాల్సి వస్తోంది. పట్టుపరిశ్రమ శాఖ అధికారి కార్యాలయం ముందు పైకప్పు చిన్న వానకే లీక్ అవుతోంది. కొద్ది రోజులుగా వానలు పడుతుండటంతో ప్రతి రోజు నీరు పడకుండా బకెట్ పెట్టాల్సి వస్తోంది. బకెట్ నిండిన వెంటనే నీరు పారపోసి మళ్లీ పెడుతున్నారు. ఇందుకు ఒక మనిషి ఉండటం గమనార్హం. బకెట్ పెట్టకపోతే లీకేజీ నీరు మడుగులా తయారవుతుంది. కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయాల మధ్య పైకప్పు అప్పుడో, ఇప్పుడో అన్నట్లుగా కూలడానికి సిద్ధంగా ఉంది. దీంతో ఉద్యోగులు ప్రాణాలరచేత పెట్టుకొని తిరగాల్సి వస్తోంది. కూలడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. జరగరానిది ఏదైనా జరిగిన తర్వాతే అధికారులు స్పందిస్తారేమోనన్న అభిప్రాయాన్ని ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రత పేరుకపోయి ఉంది. వ్యవసాయ శాఖ, డ్వామా, డీఆర్‌డీఏ ఉద్యోగులకు ఉద్దేశించిన టాయ్‌లెట్స్ బీభత్సంగా తయారయ్యాయి. మరో గత్యంతరం లేక ఉద్యోగులు అత్యవసరాలకు ఈ టాయ్‌లెట్స్‌నే ఉపయోగిస్తున్నారు.



ఇటీవలి వర్షాలకు పట్టు పరిశ్రమ శాఖ అధికారి చాంబర్ ముందు లీకేజీ నీటి కోసం పెట్టిన బకెట్లు



జేసీ చాంబర్ సమీపంలో కుక్కల మలమూత్రాలు



డ్వామా, వ్యవసాయ శాఖ కార్యాలయాల మధ్య పైకప్పు దుస్థితి